క్లుప్తంగా

గురుకులాల ఎంట్రెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎర్రుపాలెం: 2025–2026 విద్యా సంవత్సరంలో గురుకులాల్లో చేరాలనుకునే విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్ష నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చే నెల ఒకటో తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. కులం, ఆదాయం, జనన తేదీ ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఫొటోతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఉచితంగా ఎంట్రెన్స్ కోచింగ్..

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో పిల్లి సంజీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఎంట్రన్స్ రాసే విద్యార్థులకు ఉచితంగా ఈ నెల 3వ తేదీ నుంచి కోచింగ్ క్లాసులు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు పిల్లి బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 80084 50700 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

కొణిజర్ల: రోడ్డు ప్రమాదాలు నివారించడానికి విద్యార్థులు తమ తల్లి దండ్రులకు రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించాలని వైరా ఎంవీఐ వరప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సమత సూపర్‌జెమ్స్ పాఠశాలలో ఆయన విద్యార్థులకు రోడ్డు భద్రతపై.. చిన్నారులకు టీవీలో షార్ట్ ఫిల్మ్ చూపించారు. అనంతరం ఆయనను మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు శాలువాతో సత్కరించారు. వైరా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఉమా శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామంలో రూ.70లక్షలతో నిర్మించతలపెట్టిన మామునూరు – లక్ష్మీపురంబీటీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా రోడ్డు నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.

శ్రీకోటమైసమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.94వేలు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు గురువారం చేపట్టారు. దేవాదాయ శాఖ ఖమ్మం విభాగం పరిశీలకుడు అనీల్‌కుమార్, కార్యనిర్వాహణాధికారి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ హుండీల ఆదాయం లెక్కించగా, రూ.94,245లు వచ్చినట్లు వారు పేర్కొన్నారు. గత దసరా సందర్భంగా నిర్వహించిన జాతర ఆదాయం అనంతరం గడిచిన రెండు నెలల హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, సిబ్బంది పర్సా లలిత్ సాయి, పగడాల మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

వైరా: వైరాలోని జాతీయ రహదారిపై మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డివైడర్‌ను రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానిక తహసీల్ ఎదుట ఉన్న డివైడర్‌ను ఇటీవల నిర్మించిన ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులకు అనుకూలంగా ఉండేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు స్థానికులు గుర్తించారు. దీనిపై ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖాధికారుల వద్ద ఎటువంటి అనుమతులు తీసుకోకుండా డివైడర్ కూల్చి వేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివైడర్‌పై ఉన్న మొక్కలను సైతం తొలగించి పగలగొట్టడంపై మున్సిపల్ కమిషనర్ వేణును వివరణ అడగా విషయం తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై విచారణ చేస్తున్నామన్నారు.

హామీలు అమలు చేయాలి

ఏన్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం వైరా డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే.. పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరుగు సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. తొలుత కార్యకర్తలు ఎరుపు రంగు దుస్తులు ధరించి మహిళలు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు.

అన్నదాతకు అండగా కేంద్ర ప్రభుత్వం

సత్తుపల్లిరూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొత్త సంవత్సరంలో అన్నదాతలకు అండగా నిలిచిందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, పర్సా రాంబాబు, రహ్మతుల్లా, విజయ్, శేషగిరిరావు,శివ పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ సర్వే త్వరగా పూర్తిచేయాలి

బోనకల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రమాదేవి సర్వే సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని రామాపురం, గోవిందాపురం గ్రామాల్లో నిర్వహించిన సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. సర్వే 90శాతం పూర్తి అయిందని మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రి, కార్యదర్శులు పాల్గొన్నారు.


బోనకల్: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమాదేవి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి, వెంకటాపురం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేని గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్‌నాయక్ గురువారం పరిశీలించారు. సిబ్బంది సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


ముదిగొండ: వెంకటాపురంలో సర్వేను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస్‌నాయక్

సివిల్ సప్లై కార్మికుల వేతనాలు పెంచాలి

కల్లూరు: వేతనాలు పెంచాలని కోరుతూ.. సివిల్ సప్లై కార్మికులు కల్లూరులో సమ్మె చేపట్టారు. గురువారం కల్లూరు సివిల్ సప్లై గోదాం వద్ద టీయూసీఐ ఆధ్వర్యంలో సెమ్మె చేపట్టి.. సివిల్ సప్లై ఆర్‌ఐ హుస్సేన్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ.. అక్టోబర్, 2023లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సివిల్ సప్లై హమాలీ కార్మికులు కూలి రేట్ల ఒప్పందం జరిగినా.. ఇప్పటివరకు కూడా పెరిగిన వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారావు, రాష్ట్ర నాయకుడు సీతారాములు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో సమ్మె చేస్తున్న సివిల్ సప్లై కార్మికులు

● సత్తుపల్లిరూరల్: కార్మికులకు ప్రభుత్వం వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన గురువారం సత్తుపల్లి సివిల్ సప్లై గోడౌన్ వద్ద ధర్నా నిర్వహించి అధికారి శేఖర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శరత్, ఆదినారాయణ, సర్వేశ్వరరావు, రామకృష్ణ, పాండు, కాశి పాల్గొన్నారు.

● ఏన్కూరు: మండల కేంద్రంలో సివిల్ సప్లై హమాలీల నిరవధిక సమ్మె గురువారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు మాట్లాడుతూ.. హమాలీల దిగుమతి చార్జీలు పెంచాలని కోరారు. సత్యనారాయణ, నర్సింహారావు, భాస్కర్, సమ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

శ్రీగోదాదేవి అమ్మవారికి గాజుల ఉత్సవం

సత్తుపల్లిటౌన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలోని శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో 18వ రోజు పాశురంలో భాగంగా గురువారం శ్రీగోదాదేవి అమ్మవారికి గాజుల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని గాజులతో అలంకరించి సాత్తుమురై సేవ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. 18వ పాశురాన్ని అర్చకులు చైతన్య వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కొత్తూరు రాజా, గుడివాడ వెంకటేశ్వరరావు, చక్రధర్, బాల లీలాకృష్ణ, పురుషోత్తం, శంకరం, సత్యావతి, కోటేశ్వరి, పుష్పావతి, శారద, విజయరూపీస్, లక్ష్మి పాల్గొన్నారు.


గోదాదేవి అమ్మవారికి గాజులోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

స్త్రీ టీ స్టాల్ ప్రారంభం

మధిర: మధిర తహసీల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్త్రీ టీ స్టాల్‌ను గురువారం తహసీల్దార్ రాళ్ల బండి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో స్త్రీ టీ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో ఇందిరా డెయిరీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. మధిర సీఐ మధు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


మాట్లాడుతున్న లంకా కొండయ్య

మధిర: ప్రతి ఒక్కరూ టీబీ(క్షయ) వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మధిర మండల టీబీ నోడల్ పర్సన్ లంకా కొండయ్య తెలిపారు. గురువారం ఇల్లూరు ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో.. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. క్షయ వ్యాధి మానవుడి శరీరంలో గోళ్లు, వెంట్రుకలకు తప్ప ఏ అవయవానికైనా రావచ్చని తెలిపారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు నిమ్ముగా ఉండి ఎక్సరేలో తేలుతుందన్నారు. రెండు వారాలకు మించి విపరీతంగా దగ్గు రావడం, రాత్రి పూట జ్వరం రావడం, ఆకలి మందగించడం, తెమడతో పాటు రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకొని ఖరీదు కలిగిన మందులను ఉచితంగా పొందవచ్చునని, తద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామంలో లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న రాఘవాపురం గ్రామానికి చెందిన మామిళ్లపల్లి రాజేష్, దొబ్బల సరస్వతి, సతీష్ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ. 1.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపి, అప్పారావు, గ్రామపెద్దలు గోవిందరావు, శ్రీనివాసరావు, మహేష్, వీరకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు

కల్లూరు/కల్లూరురూరల్/పెనుబల్లి: సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మండలంలో పేరువంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో, కల్లూరు, పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ జన్మదినం పురస్కరించుకొని విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, హైస్కూల్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ కుతుంబాక శ్రీనివాస్, యూసఫ్, సీడీసీ చైర్మన్ నరేంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ నీరజదేవి, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

సత్తుపల్లిటౌన్: జీవిత బీమా సంస్థ ద్వారా మహిళా సాధికారత పథకంలో లభించే ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పట్టణంలోని వేంసూరురోడ్‌లో జీఎస్‌ఆర్ ఇన్సూరెన్స్‌హబ్‌ను ఆమె ప్రారంభించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 సంవత్సరాల నుంచి 70 ఏళ్ల లోపు మహిళలు ఈ పథకం ద్వారా మొదటి ఏడాది నెలకు రూ.7వేలు వేతనం లభించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులను తలపాగ, శాలువాలతో చీఫ్ ఎడ్వైజర్ గోలి శ్రీనివాసరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, గోలి ఉషా, నర్సింహారావు, నరేందర్ రెడ్డి, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ లను సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

వృద్ధులు, వితంతువులకు రగ్గుల పంపిణీ

సత్తుపల్లిరూరల్: నిరుపేదల వృద్ధులు, వితంతువులకు నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలికాలం దృష్ట్యా రగ్గులను పంపిణీ చేశారు. గురువారం పట్టణ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రగ్గుల పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె నర్సింహారెడ్డి, తోట కిరణ్‌లు తెలిపారు. స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాల డైరెక్టర్ గుమ్మడి శ్రీనివాసరావు తండ్రి గుమ్మడి సాంబశివరావు 3వ వర్ధంతి సందర్భంగా సుమారు రూ.10వేల విలువైన రగ్గులను వారి సహకారంతో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన గుమ్మడి శ్రీనివాసరావుకు సంస్థ తరపున నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మాదిరాజు పుల్లారావు, గాదె నాగు, సుధీర్, సురేంద్ర సింగ్, ఏసయ్య, కాంతారావు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు..

తల్లాడ: తల్లాడలో గురువారం వృద్ధులు, దివ్యాంగులకు బ్రదర్ కె.ఇశ్రాయేలు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇశ్రాయేలు మాట్లాడుతూ.. మానవత్వంతో వృద్ధులు, వికలాంగులకు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.58వేలు వితరణ..

సత్తుపల్లి: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రముఖ తాపీమేస్త్రీ కంచేటి రమేష్, దుర్గా దంపతులు గురువారం రూ.58,116లు ఆలయ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, ఉప్పల వెంకటేశ్వరరావు, రాగాల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరు సుఖసంతోషాలతో ఉండాలి

సత్తుపల్లి: ఈ నూతన సంవత్సరంలో అందరు సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం సత్తుపల్లి, వేంసూరు మండలాల నాయకులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, వనమా వాసు, ఎస్‌కె ఛాంద్‌పాషా, వల్లభనేని పవన్, ప్రభాకర్, అంకమరాజు, మోహన్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మువ్వా క్యాంప్ కార్యాలయంలో..

టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబుకు నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు నాయకులు, అభిమానులు గురువారం సత్తుపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి పరిరక్షణ మానవధర్మం

ఏన్కూరు: సమస్త జీవరాశుల మనుగడకు ఆధారమైన ప్రకృతిని పరిరక్షించడం మానవధర్మమని 108 ఏళ్ల బాబా శాంత సదానందగిరి హితవు పలికారు. మండల పరిధిలోని నాచారంలోని సంకల్ప సమాధియోగ ఆశ్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా చార్యులు డాక్టర్ ప్రేమ్ నిరంతర్ మాల్లేష్ గురూజీ ఆధ్వర్యంలో నాచారంలో ఆశ్రమం నెలకోల్పడం ఆనందదాయకం అన్నారు. అనంతరం శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి దేవలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దారా విష్ణు మోహన్‌రావు, జవ్వాజి నర్సింహారావు, నంబూరు మోహన్‌రావు, వివి ప్రసాదు, కోటయ్య, ముత్యం, నిమ్మకంటి దామోదర్ ప్రసాద్, దుగ్గిదేవర అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ, యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

పీఆర్‌టీయూ..


తల్లాడ: క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, నాయకులు

తల్లాడ: తల్లాడలో గురువారం పీఆర్‌టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తల్లాడ మండల ఎంఎన్‌ఓ నరసింహారావు, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు నరసింహారావు, కమలాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్..

తల్లాడ మండల టీఎస్ యూటీఎఫ్ శాఖా ఆధ్వర్యంలో గురువారం క్యాలెండర్, డైరీని ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ ఆవిష్కరించారు.

మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ అన్నారుగూడెం పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ ఎస్.దామోదర ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లాల్‌సయ్యద్, తాళ్లూరి శ్రీనువాసరావు, టీఎస్ యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ..


మధిర: క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మధిర: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం పీఆర్‌టీయూ 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరు సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, సంగారావు, నరసింహారావు, అప్పారావు, జమీర్, శ్రీనివాసరావు, శ్యామలరావు, అజయ్ కుమార్, నాగేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ముదిగొండ/ఎర్రుపాలెం: ముదిగొండ, ఎర్రుపాలెం మండలకేంద్రాల్లోని విద్యావనరుల కేంద్రంలో గురువారం పీఆర్‌టీయూ క్యాలెండర్లను తహసీల్దార్ సునీతఎల్జిబెత్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంఈఓలు రమణయ్య, మోరాళీమోహన్‌రావు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలల్లో పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు గురువయ్య, మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, బాబురావు, జిల్లా అసోసియోషన్ అధ్యక్షులు అమృతకుమార్, రాష్ట్ర కార్యదర్శి సంజీవరావు, మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ..


కొణిజర్ల: ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ అబ్రహం, హెచ్‌ఎంలు

కొణిజర్ల: కొణిజర్ల మండల ఎస్టీయూ టీఎస్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం కొణిజర్లలో నిర్వహించారు. ఎంఈఓ అబ్రహం, కొణిజర్ల కాంప్లెక్స్ హెచ్‌ఎం శాంతికుమారి, పల్లిపాడు కాంప్లెక్స్ హెచ్‌ఎం సుజాత, గుబ్బగుర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివన్నారాయణ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరామత్ అలీలు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కొణిజర్ల మండల అధ్యక్షుడు షేక్ సైదా, మహిళా కార్యదర్శి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ, యూటీఎఫ్..

ఏన్కూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేల ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంఈఓ శ్రీనివాసరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ క్యాలెండర్, యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.